క్లుప్తంగా

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కలిగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శక్తి యాప్ ద్వారా మహిళలు, విద్యార్థినుల భద్రత, బాలికల ఆత్మ రక్షణకు సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలనే అంశాలపై టోల్ ఫ్రీ నెంబర్ 7993485111, ఏదైనా అత్యవసర సమయంలో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతిప్రియ పేర్కొన్నారు. ఏలూరు ఎన్ఆర్ఐ కాలేజ్ విద్యార్థినులకు శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. శక్తి యాప్ డౌన్ లోడ్ చేయడం, యాప్ ఫీచర్లు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

8న శ్రమ కావ్యం గాన సభ




కరపత్రం విడుదల చేసిన సీఐటీయూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రమ ఔన్నత్యాన్ని తెలియజేస్తూ డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రమకావ్యం అనే అంశంపై ఈనెల 8న సదస్సు నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంబంధిత కరపత్రం విడుదల చేశారు. సంపద సృష్టించే కార్మికులు, కర్షకులు వివిధ రకాల సేవలు చేసే ఉద్యోగులు, మేధో శ్రామికులు వారి శ్రమ గొప్పతనాన్ని వివరిస్తూ ఈ శ్రమ కావ్యం రాశారని తెలిపారు. అశోక్ తేజ స్వయంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 59 ప్రదర్శనలు ఇచ్చారని ఏలూరులో ఈ నెల 8న జరిగే సదస్సు 60వ శ్రమ కావ్య గానం అని తెలిపారు. శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని, మానవ హక్కుల కోసం ఈ రచనల్లో ప్రముఖంగా ఉన్నాయన్నారు. ఏలూరు రైల్వే స్టేషన్ రోడ్ లోని టొబాకో మర్చంట్స్ హాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రమ కావ్యం గానం సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మధ్య తరగతికి మొండిచేయి

- కూటమి పాలనలో అమలుకాని పథకాలు
- 2.20 లక్షల మందిపై ప్రభావం
- ఉద్యోగాల తొలగింపుతో పతనమైన జీవితాలు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : సరిగ్గా ఏడాది క్రితం వరకు ఎంతో దర్జాగా జీవించిన మధ్య తరగతి ప్రజలు ప్రస్తుతం జీవన ప్రమాణాలు సన్నగిల్లి ఆదాయం పడిపోయి దుర్భరంగా మారాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేసి మధ్యతరగతి ప్రజలకు కూడా వర్తింపజేసి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం అధికారం చేబట్టి ఏడాది గడుస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ఆర్భాటంగా ప్రకటించిన వాటిలో ఒక్క ఉచిత గ్యాస్ పథకం తప్ప ఏ ఒక్క పథకాన్నీ అమలు చేయలేదు.

పథకాలు అమలు కాక కుదేలు

ఏడాది క్రితం వరకు అమ్మ ఒడి, ఆసరా, చేయూత, కాపు నేస్తం, బీసీ నేస్తం వంటి పథకాలతో పాటు సమయానికి డ్వాక్రా రుణాల అందజేసి మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు చేపట్టారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేసినట్టుగానే మధ్యతరగతి ప్రజలకూ జగన్ ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకుంది. జగన్ ఇచ్చిన హామీల్లో దాదాపు అన్నీ నెరవేర్చడంతో ఆయా పథకాల లబ్ధితో మధ్యతరగతి ప్రజలు సంతోషంగా జీవించారు. అప్పట్లో ఆయా పథకాల ద్వారా తమ ఖాతాల్లో నేరుగా జమైన డబ్బులతో 2014 – 19 మధ్య కాలంలో టీడీపీ పాలనలో చేసిన అప్పులను తీర్చుకుంటూ, వారి అవసరాలను తీర్చుకుంటూ ఆనందంగా జీవించారు. తమ స్థాయిని మరింత ఉన్నతంగా పెంచుకోవడానికి కొందరు మధ్యతరగతి ప్రజలు ప్రణాళికాబద్ధంగా రుణాలు తీసుకుని వాటిని పథకాల ద్వారా వచ్చిన డబ్బుతో తీర్చుకుంటూ మరో మెట్టుపైకి ఎగబాకారు.

నిలువునా మోసం

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ప్రకటించిన పథకాలను అమలు చేయకపోవడంతో ఏలూరు నియోజకవర్గంలో 2.20 లక్షల మందిపై ఆ ప్రభావం పడింది. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని, 18ఏళ్ళు వయసు నిండిన ప్రతి ఆడబిడ్డకూ నెలకు రూ.15 వేలు ఇస్తామని, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పథకాలను గాలికి వదిలేయడంతో మధ్యతరగతి ప్రజలు తాము నిలువునా మోసపోయామని గ్రహించారు. ఏలూరు నియోజకవర్గంలో సుమారు 3.50 లక్షల మంది ప్రజలు ఉండగా వారిలో 2.20 లక్షల మంది మధ్యతరగతి వారే ఉన్నారు. వారిలో చిరుద్యోగులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు, వివిధ ఉపాధి పనులు చేసుకునే వారే ఏలూరు నియోజకవర్గంలో అధికశాతం మంది ఉన్నారు. ప్రభుత్వం చేసిన మోసంతో వారంతా ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు.

పతనమైన జీవితాలు

చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్న అనేక మందిని కూటమి ప్రభుత్వం తొలగించడంతో వారి కుటుంబాలు పతనం దిశగా అడుగులు వేస్తున్నాయి. నగరంలో సుమారు 700 మందిని గత ప్రభుత్వం వలంటీర్లుగా నియమించి వారికి నెలకు రూ.5 వేలు వేతనంగా అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వారిని తొలగించబోమని స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు వారికి రూ.10 వేలకు పెంచి ఇస్తామని కూడా చెప్పింది. దీంతో ఎంతో ఆశగా కూటమి నాయకునికి ఓట్లు వేసిన 700 మంది వలంటీర్లు, వారి కుటుంబ సభ్యులు ఇప్పుడు రోడ్డుపై పడ్డామంటున్నారు. నగరంలో చెత్త ఎత్తడానికి వినియోగించే క్లాప్ ఆటోలు తొలగింపు, రేషన్ వాహనాల నిలుపుదలతో వాటి ద్వారా ఉపాధి పొందుతున్న మరో 150 మంది, వారి కుటుంబ సభ్యులు ఉపాధి కోల్పోయి కష్టాలను అనుభవిస్తున్నారు.

అప్పులూ పుట్టడం లేదని ఆవేదన

మధ్యతరగతి ప్రజల ఆదాయం తక్కువగా ఉండడంతో తమ అవసరాల కోసం అప్పులు చేస్తూ ఉండేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా వివిధ పథకాలకు సంబంధించి వారి కుటుంబాలకు దాదాపు రూ.50 వేల వరకు సహాయం అందించేది. ఆ డబ్బుతో వారి అప్పులు చెల్లించుకుని తిరిగి అవసరమైనప్పుడు అప్పులు చేసుకునేవారు. అయితే గత ఏడాది కాలంగా ప్రభుత్వం ఏ పథకమూ అమలు చేకపోవడంతో వారి వద్ద డబ్బు ఉండడం లేదు. తమ అవసరాల కోసం అప్పులు చేయడానికి ఎవరినైనా అప్పు ఇమ్మని అడిగినా వారికి పథకాలు ఏమీ రాకపోవడంతో తిరిగి డబ్బు చెల్లించలేరనే ఉద్దేశంతో ఎవరూ అప్పులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

వైద్యం వాయిదా



చాలీచాలని ఆదాయంతో జీవితాన్ని నెట్టుకొస్తున్న మాకు చేతిలో డబ్బు ఆడడం లేదు. వచ్చిన ఆదాయం ఇంటి ఖర్చులకే కటాకటిగా సరిపోతోంది. ఎవరైనా బంధువులు ఇంటికి వస్తే వారి మర్యాదల కోసం కొద్ది మొత్తం అప్పులు చేయాల్సి వస్తోంది. ఎప్పుడైనా అనారోగ్యం పాలైతే చేతిలో చిల్లిగవ్వ లేక అప్పు కోసం వెళ్లినా దొరకడం లేదు. దీంతో వైద్యాన్ని కూడా వాయిదా వేసుకోవాల్సి వస్తోంది.

– గొల్లవిల్లి ఆదిలక్ష్మి, గృహిణి

రెండు మూడు పథకాలైనా అమలు చేయాలి



గత ప్రభుత్వంలో ఏడాదికి మా కుటుంబానికి కనీసం నాలుగు పథకాలకు సంబంధించిన డబ్బు వచ్చేది. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క పథకాన్నీ అమలు చేయకపోవడం దారుణం. అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీల్లో కనీసం రెండు పథకాలనైనా ప్రభుత్వం అమలు చేయాలి. ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోకుండా ఉండాలంటే పథకాల అమలు తప్పనిసరి.

– బొందిలి పద్మ, గృహిణి, ఏలూరు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవ మనుగడ, అభివృద్ధి పర్యావరణంతో ముడిపడి ఉందని, పర్యావరణం పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పవర్‌పేట, వాసు ఆలయం ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, బాల వికాస్ భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మానవజాతి సుఖంగా బతకాలంటే ప్రకృతి సమతుల్యత పాటించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. మానవత సంస్థ ప్రతినిధి మేతర అజయ్ బాబు, సభాధ్యక్షుడు కట్టా సత్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ, మానవత సంస్థ నాయకులు పోలవరపు దేవ రత్నాకర్, యలమందల ఆనంద నాయుడు, డీవీ నరసింహారావు, పీవీ శ్రీ రమణ, కూచిపూడి సత్యనారాయణ, కడుపు కన్నయ్య, అల్లం సుబ్బారావు తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుత విపత్కర వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టి ముందుకు సాగాలన్నారు. సదస్సులో పాల్గొన్న ఏఎస్ఆర్ స్టేడియంలో వ్యాయామ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు, బాలలకు మహిళలకు పౌష్టికాహారం, జూట్ బ్యాగ్‌లను అందజేశారు. పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ

విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్ల ప్రదానం



బాలల గ్రంథాలయంలో బహుమతులు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు మహిళా గ్రంథాలయం, బాలల గ్రంథాలయాల్లో గత 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. చిన్నారి డి.రేయాన్షా, షణ్ముఖప్రియ తొలుత స్వాగత సుమాంజలి నృత్యాలతో అలరించారు. అనంతరం విద్యార్థులకు స్వర్ణాంధ్ర – 2047 అనే అంశాలపై నిర్వహించిన పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. అనంతరం ఈ శిక్షణ తరగతులను సక్రమంగా, క్రమం తప్పకుండా నిర్వహించిన నిపుణులు, రిసోర్స్‌పర్సన్లను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎం శ్యామల బాబు, పి.అపర్ణ కుమార్, కె.కరుణాకర్, బి.రమేష్, ఎండీ అస్లాం పాషా, బీవీఎస్ లక్ష్మి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- బాలల గ్రంథాలయంలో వివిధ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు జిల్లా గ్రంధాల సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, బాలల గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ వేసవి సెలవుల కాలాన్ని వినోదాత్మకంగా, విజ్ఞానాన్ని అందించడానికి దాదాపు 35 రోజులు వేసవి శిబిరాల నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వి.కొండలరావు, ఎం పద్మనాభరావు, ఎం చాముండేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది మనిపురి శోభ, ఎం కీర్తి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మహిళా గ్రంథాలయంలో బి.హిమాచలేశ్వరి, వై.సుశీల, బేత పద్మ, ఎం జగదీశ్వర్, జి.నిర్మల తదితరులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందచేశారు. గ్రంథాలయాధికారి యాగంటి శ్రీదేవి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న బాలలు



మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	48	బీక్షదిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	46
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	128
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	03
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	07
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	18
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే నెల 7వ తేదీన జరుగనున్న ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎల్ఎఫ్ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి ఏలూరు జిల్లా సమీక్ష సమావేశం స్థానిక ఇజ్రాయేల్ పేటలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూచిపూడి సత్యం మాదిగ, ఏలూరు జిల్లా ఎమ్మెర్పీఎస్ అధ్యక్షుడు కందుల రమేష్, సభాధ్యక్షుడు కొత్తపల్లి మురలీకృష్ణ మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎస్సీ కులాల యువతకు శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగ యువతకు లిడ్క్యాప్ – సీడాప్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్‌వేర్ రంగానికి సంబంధించి స్టిచ్చింగ్ ఆపరేటర్, కట్టర్, ఫుట్ వేర్ లెదర్, సెవింగ్ ఆపరేటరు, ప్రీ – అసెంబ్లింగ్ ఆపరేటరు, లాస్టింగ్ ఆపరేటరు, క్వాలిటీ కంట్రోల్ ఇన్స్‌పెక్టర్, హెల్పర్, శ్యాంపిల్ మేకర్, అప్పర్ మేకింగ్‌లలో శిక్షణతోపాటు గూడ్స్ – గార్మెట్స్ విభాగంలో స్టిచ్చింగ్ ఆపరేటర్, ఫుట్‌వేర్, ఫ్యాషన్ యాక్సెసరీస్ రిటైల్ అసోసియేట్‌లలో గుంటూరులో 45 రోజుల పాటు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఉచిత వసతి, ఉచిత భోజనం వెల్‌కమ్ కిట్టు ఇస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 9493291177, 7981438585, 9494477597లో సంప్రదించవచ్చని ముక్కంటి పేర్కొన్నారు.

రాగి వైరు అపహరణ

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి అందులోని రాగివైరును అపహరించుకుపోయారని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు. చొదిమెళ్ల ప్రాంతంలో జి.సత్యనారాయణ పంట పొలంలో 16కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగివైరును అపహరించుకుపోయారని, దీనిపై ఎలక్ట్రికల్ ఏఈ తానేటి శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టామని వివరించారు.

నేరాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాలను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. నిందితులను అరెస్ట్, న్యాయస్థానాల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. నేరాలు జరిగిన వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్న నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచేందుకు శ్రద్ధ వహించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కైకలూరు రూరల్, భీమడోలు, నిడమర్రు, ఏలూరు వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు వి.రవి కుమార్, యూజే విల్సన్, ఎంవీ సుభాష్, జి.సత్యనారాయణ, కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

దెందులూరు : వేసవి సెలవులను వృథా చేసుకోకుండా విజ్ఞానం పొందడం ఆటలు, పాటలు, పుస్తక పఠనం చేయడం అభినందనీయమని ఏలూరు రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చాటపర్రు గ్రంథాలయ అధికారి వాసుకి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో వివిధ విభాగాల్లో విజేతలైన పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్, గ్రామ నాయకులు బహుమతులను అందజేశారు.

ఆవులను తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సమీపంలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్‌కే రహీం అనే వ్యక్తి సీతంపేట నుంచి మినీ వ్యాన్‌లో రెండు ఆవులు, నాలుగు గిత్తలను తోటగూడెం ప్రాంతానికి తరలిస్తున్నాడన్నారు. వాహన తనిఖీల్లో ఆవులను గుర్తించామని, మినీ వ్యాన్‌ను సీజ్ చేసి, ఆవులను ఏలూరు నగరంలోని గోశాలకు తరలించామని వివరించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కామవరపుకోట: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్య తీసుకోవాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు కోరారు. మండలంలో రామన్నపాలెం గ్రామంలో పొగాకు, కోకో, పామాయిల్ రైతులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారని, వారు ఇబ్బందులను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని విజయరాజును కోరారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతు కూటమి ప్రభుత్వం పాలన చేపట్టినప్పటి నుంచి రైతుల సంక్షేమాన్ని గాలి వదిలేసిందన్నారు. పంటకు సరైన గిట్టుబాటు ధర రాక, పెట్టుబడి పెరిగి ఆర్థికంగా నష్టపోయి రైతులు అప్పుల పాలు అవుతున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.23 వేలు వరకు లభించిందని, కోకో గింజలు కిలో ధర రూ.800 నుంచి రూ.1200 వరకు లభించిందని గుర్తుచేశారు. ఇప్పుడు రైతులు సరైన గిట్టుబాటు ధర రాక రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.